

రోడ్ల నిర్మాణానికి రూ. 48.45 కోట్లు



రూ.4.5కోట్లతో సంజీవనగర్‌గేట్ నుంచి ఆత్మకూరు బస్టాండ్ వరకు మంజూరైన సీసీరోడ్డు

నంద్యాల హాస్పిటల్, మే 14, (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని అధిగమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి వైపు అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలో రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఆర్‌అండ్‌బీ శాఖకు రూ.48.45కోట్లు, 19పనులకు రోడ్ల నిర్మాణం చేపట్టేందుకు పరిపాలనా అనుమతి కూడా లభించింది. త్వరలోనే ఈ పనులకు సంబంధించి టెండర్లు పిలవనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రహదారుల నిర్మాణాలు చేపట్టడంతో కొన్నేళ్లుగా ఇబ్బంది పడుతున్న ప్రజలు ఊరట చెందనున్నారు. మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్ల (ఎండీఆర్)తో ప్రస్తుతం జిల్లాకు ఈ పనులు మంజూరయ్యాయి. ఇప్పటికే జిల్లాలో రోడ్లు, బ్రిడ్జిలు, కల్వర్టుల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కొత్తగా మరో 19పనులు ఆర్‌అండ్‌బీ శాఖ తరఫున రూ.48.45కోట్లతో చేపట్టనున్నారు.



అయ్యలూరు మెట్ట రోడ్డు

త్వరలో టెండర్లు



ఎండీఆర్ పరిధిలో మంజూరైన 19పనులకు త్వరలో టెండర్లు పిలుస్తాం. పరిపాలన అనుమతి వచ్చింది. బడ్జెట్ కేటాయింపు కోసం ఎదురుచూస్తున్నాం. జిల్లావ్యాప్తంగా పనులు సకాలంలో పూర్తయ్యేలా చూస్తాం.

- శ్రీధర్‌రెడ్డి, ఈఈ, ఆర్‌అండ్‌బీ శాఖ

- 19పనులకు పరిపాలనా అనుమతులు
- త్వరలో టెండర్ల ప్రక్రియ
- సకాలంలో పూర్తి చేస్తాం
- ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి

మంజూరైన పనులు...

నంద్యాలలోని సంజీవనగర్ గేట్ నుంచి ఆత్మకూరు బస్టాండ్ వరకు .రూ.4.50కోట్లు. అయ్యలూరుమెట్ట నుంచి ఎన్‌హెచ్, బైపాస్‌రోడ్డుకు రూ.3కోట్లు. శ్రీశైలం నియోజకవర్గంలోని ఆత్మకూరు నుంచి కొట్టాల చెరువు రోడ్డుకు రూ.1.50కోట్లు. శ్రీశైలం నియోజకవర్గం రేగడగూడూరు నుంచి పాములపాడు రోడ్డుకు రూ.2.20కోట్లు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ఉయ్యాలవాడ-సుద్దమల్ల రోడ్డుకు రూ.కోటి, ఆళ్లగడ్డ నియోజకవర్గంలో దొర్నిపాడు-యాళ్లూరు రోడ్డుకు రూ.1.50కోట్లు. డోన్ నియోజకవర్గంలో సిమెంట్‌నగర్-రామతీర్థం రోడ్డుకు రూ.2.10కోట్లు. పాణ్యం నియోజకవర్గంలో నందివర్గం-ఎస్.కొత్తూరు రోడ్డుకు రూ.2.50కోట్లు. బనగానపల్లె నియోజకవర్గంలో కాల్వ-బేతంచెర్ల రోడ్డుకు రూ.2.95కోట్లు. పాణ్యం-బనగానపల్లె రోడ్డుకు రూ.3.50కోట్లు. బనగానపల్లె నియోజకవర్గంలో ప్యాపిలి- యాగంటి- బనగానపల్లె రోడ్డుకు రూ.2.80కోట్లు. బనగానపల్లె నియోజకవర్గంలో కోవెలకుంట్ల-బనగానపల్లె రోడ్డుకు రూ.2.70కోట్లు. బనగానపల్లె నియోజకవర్గంలో నంద్యాల- తిమ్మ నాయునిపేట రోడ్డుకు రూ.2.50కోట్లు. బనగానపల్లె నియోజకవర్గంలో కోవెలకుంట్ల- ఆళ్లగడ్డ రోడ్డుకు రూ.3.20కోట్లు. బనగానపల్లె నియోజకవర్గంలో నంద్యాల- తిమ్మనాయునిపేట రోడ్డుకు రూ.2.50కోట్లు. నందికొట్కూరు నియోజకవర్గంలో నంద్యాల-గడివేముల-మిడుతూరు-నందికొట్కూరు రోడ్డుకు రూ.2.50కోట్లు. పాణ్యం నియోజకవర్గంలో పాణ్యం-బనగానపల్లె రోడ్డుకు రూ.2.50కోట్లు. ఆళ్లగడ్డ నియోజ కవర్గంలో కోవెలకుంట్ల-ఆళ్లగడ్డ రోడ్డుకు రూ.2కోట్లు. శ్రీశైలం నియోజకవర్గంలో వెలుగోడు-గడివేముల-కాల్వరోడ్డుకు రూ.3కోట్లు.

హోంగార్డ్స్ సంక్షేమానికి ప్రాధాన్యం

- విధుల్లో ప్రతిభ కనబర్చాలి
- పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలి
- హోంగార్డ్స్ కమాండెంట్ మహేశ్‌కుమార్



హోంగార్డ్స్‌కు సూచనలు ఇస్తున్న కమాండెంట్ మహేశ్‌కుమార్

నంద్యాల టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): హోంగార్డ్స్ సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తామని హోంగార్డ్స్ కమాండెంట్ మహేశ్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక ఎస్పీ కార్యాలయం మైదానంలో కవాతు నిర్వహించి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం వారికి దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టల్ డిపార్టుమెంట్‌లో ప్రతిఒక్కరికి ప్రమాద బీమా సుమారుగా రూ.3.95 లక్షలు అందజేస్తున్నట్లు గుర్తు చేశారు. ఎవరూ కూడా దురాలవాట్లకు లోనుకాకుండా పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ద్వారా వచ్చే పాలసీలు రెన్యూవల్ చేసుకోవాలన్నారు. పోలీసు వారితో సమానంగా సేవలు నిర్వహించాలన్నారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో హోంగార్డ్స్ డీఎస్పీ ప్రసాద్, రిజర్వు ఇన్‌స్పెక్టర్ మంజునాథ్, సురేశ్‌బాబు, ఆర్ఎస్సై ఉమా మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు


పాణ్యం, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బలపనూరు పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మేరీ సలోమి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లు పొందాల్సిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మూడో తరగతి ప్రవేశానికి చెంచు బాలికలకు 75 సీట్లు, ఎస్సీలకు 2 సీట్లు, ఓసీలకు 1, బీసీలకు1, ఇతరులకు 1 చొప్పున మొత్తం 80 సీట్లు కేటాయించినట్లు తెలిపారు. కేవలం చెంచు బాలికలకు మాత్రమే నాలుగో తరగతికి 66 సీట్లు, 5వ తరగతికి 70 సీట్లు, 6వతరగతికి 65, 7వతరగతికి 59 సీట్లు, 8వతరగతికి 60 సీట్లు, 9వతరగతికి 49 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ప్రకాశం, గుంటూరు, కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన బాలికలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 25వ తేదీలోగా దరఖాస్తులను పాఠశాలకు అందజేయాలన్నారు. వివరాలకు 8106979149, 7013582204 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

గోరకల్లుకు రూ.2.5 కోట్లు మంజూరు



కుంగిన రిజర్వాయర్ కట్ట

నంద్యాల మున్సిపాలిటీ, మే 14 (ఆంధ్రజ్యోతి): గోరకల్లు రిజర్వాయర్‌లో మరమ్మతులకు రూ.2.5 కోట్లు మంజూరైనట్లు జిల్లా సాగు నీటి ప్రాజెక్టుల అధికారి, తెలుగు గంగ ఎస్ఈ శివ ప్రసాదరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సార్బీసీ ప్రాజెక్టులో అత్యంత కీలకమైన గోరుకల్లు రిజర్వాయర్ పటిష్టతకు కలెక్టర్ రాజకుమారి ప్రత్యేక దృష్టి సారించి నిధులు మంజూరు చేయించారన్నారు. గోరుకల్లు ఈఈ శుభకుమార్ మాట్లాడుతూ నిధులతో రిజర్వాయర్‌లో కుంగిన 120 మీటర్ల ఆనకట్టను పునర్నిర్మాణం చేపడతామని తెలిపారు. కట్ట పటిష్టతకు ఇసుక, కంకర వడపోత నిర్మాణ పద్ధతిని అనుసరించనున్నట్లు చెప్పారు. ఈ పద్ధతి వల్ల రిజర్వాయర్ ఆనకట్ట పటిష్టంగా ఉంటుందన్నారు. వర్షాకాలం ప్రారంభం నాటికి ఈ పనులు పూర్తి చేస్తామని ఈఈ శుభకుమార్ తెలిపారు.






బిల్వ సోయగం

- ఆకట్టుకున్న బిల్వ స్వర్గం గుహలు
- ప్రకృతి సహజ సిద్ధంగా వివిధ రూపాలు
- బేతంచెర్ల నుంచి ఐదు కిలోమీటర్లు
- 19వ శతాబ్దంలో పురావస్తు పరిశోధనలు
- ఎర్రజ్వాల గుహలు అని ప్రతీతి
- అరకొర సౌకర్యాలే అంటున్న సందర్శకులు



ఎర్రజ్వాల గుహ



సహజసిద్ధంగా ఏర్పడిన బిల్వ గుహలు



సున్నపురాతి బిల్వ గుహ

బేతంచెర్ల, మే 14 (ఆంధ్రజ్యోతి): బిల్వ స్వర్గం గుహలు అందాలు వర్ణించలేం. ఎర్రమల కొండల్లో ప్రకృతి సహజ సిద్ధంగా వివిధ రూపాలు కనిపించేలా నీళ్ల పారుతున్న విధంగా రమణీయంగా బిల్వ స్వర్గం గుహలున్నాయి. వివరాల్లోకి వెళితే.. బేతంచెర్ల మండలం కనుమకింద కొట్టాల గ్రామానికి కిలోమీటరు దూరంలో బిల్వ స్వర్గం గుహలు ఉన్నాయి. వీటిని ఎర్రజ్వాల గుహలు అని కూడా పిలిచేవారని కొట్టాల గ్రామస్థులు చెబుతున్నారు. ప్రస్తుతం బిల్వ స్వర్గం గుహలుగా పిలుస్తున్నారు. ఈ గుహలను 19వ శతాబ్దం మధ్యలో వీటిలో పురావస్తు, పేలియాంటాలజి పరిశోధనలు మొదలయ్యాయి. ఈ పరిశోధనల్లో పాతరాతియుగం నాటి దక్షిణ భారత పరిస్థితులు, అప్పటి మానవ జీవన స్థితిగతుల గురించి ఎన్నో విషయాలు తెలిశాయి. ఈ ప్రాంతంలో ఇటువంటి ఎన్నో సున్నపురాతి గుహలూ, గుహల సముదాయాలు ఉన్నప్పటికీ, బిల్వ స్వర్గంలోనే అత్యధికంగా పరిశోధనలు జరిగాయి. బిల్వ స్వర్గం గుహల్లో రెండు ప్రాథమిక గుహలు, మరి కొన్ని చిన్నగుహలూ కలిపి లోతైన గండి లేక బిలాలుగా ఏర్పడ్డాయి. వీటిని 1844లో న్యూబోల్డ్ అనే ఆంగ్లేయుడు కనుగొన్నా 1884లో రాబర్ట్ బ్రూస్ ఫ్రూట్ నేతృత్వంలో ఇక్కడ తవ్వకాలు మొదలయ్యాయి. ఈ బృందం ఈ గుహ సముదాయంలోని చార్నెల్ హౌస్, పర్గేటరి, క్యాథడ్రల్ గుహల్లో తవ్వకాలు జరిపింది. తవ్వకాలో పాతరాతియుగం నాటి ఎముకలతో చేసిన బాణపు అలుగులూ, ఈటెమొనలూ, చాకులు, ఉలులూ, పదునైన శూలాలతోపాటు జంతు అవశేషాలు కూడా లభ్యమయ్యాయి. అయితే ఈ ఆధారాల్లో ఎక్కువ శాతం లండన్‌కు తరలించే క్రమంలో కనుమరుగయ్యాయి. బేతంచెర్ల నుంచి బిల్వ స్వర్గం గుహలకు ఐదు కిలోమీటర్లు. కర్నూలు, బనగానపల్లె, డోన్ తదితర పట్టణాల నుంచి బిల్వ స్వర్గం గుహలు సందర్శించడానికి రోడ్డు సౌకర్యం కూడా ఉంది. బిల్వస్వర్గం గుహలకు వచ్చే సందర్శకులకు అరకొర సౌకర్యాలు అధికారులు ఏర్పాటు చేశారని పలువురు సందర్శకులు తెలుపుతున్నారు.

మల్లన్న సేవలో జాతీయ ఎస్సీ కమిషన్ కార్యదర్శి శ్రీనివాస్



స్వామివార్ల శేషవస్త్రం, చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో

శ్రీశైలం, మే 14(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మల్లికార్జున స్వామి, భ్రమరాంబ అమ్మవార్లను బుధవారం జాతీయ ఎస్సీ కమిషన్ కార్యదర్శి జి.శ్రీని వాస్ దర్శించుకున్నారు. ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న ఆయనకు ఆలయ ఈవో ఎం. శ్రీనివాసరావు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం కార్యదర్శి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. దర్శనానంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో శ్రీనివాస్‌కు వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ ఈవో స్వామివార్ల శేషవస్త్రం, చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

క్రీడాకారులు క్రీడాస్ఫూర్తి కలిగి ఉండాలి

- డీఎస్‌డీవో ఎంఎన్‌వీ రాజు
- రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు జిల్లా క్రీడాకారులు



ఎంపికైన క్రీడాకారులతో జిల్లా సంఘం సభ్యులు

నంద్యాల హాస్పిటల్, మే 14, (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు క్రీడాస్ఫూర్తి కలిగి ఉండాలని డీఎస్‌డీవో ఎంఎన్‌వీ రాజు అన్నారు. బుధవారం జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో 11ఏళ్ల లోపు విభాగంలో ఎంపిక పోటీలు నిర్వహించారు. రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు జిల్లాకు చెందిన మన్‌విత్‌నాయక్, శివకార్తికేయ, రిషితాబాయి, సాయితేజస్ ఎంపికైనట్లు జిల్లా చెస్ సంఘం ప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 24, 25తేదీల్లో నరసరావు పేటలో జరిగే రాష్ట్ర స్థాయి ఓపెన్ బాల, బాలికల చెస్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారన్నారు. అనంతరం విజేతలకు పతకాలు, ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు డా.రవికృష్ణ, మునిశేఖర్, జిల్లా క్రీడాభారతి కార్యదర్శి సుధాకర్, ఆర్బిటర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

- విద్యార్థులు డ్రగ్స్ జోలికి వెళ్లకూడదు
- సెట్కూరు సీఈవో డా.వేణుగోపాల్



మాట్లాడుతున్న సెట్కూరు సీఈవో డా.వేణుగోపాల్

కర్నూలు స్పోర్ట్స్, మే 14 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా కృషిచేయాలని సెట్కూరు సీఈవో డా.వేణుగోపాల్ అన్నారు. బుధవారం జిల్లా యువజన సంక్షేమ శాఖ, జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో సర్వోదయ ఐటీఐ కళాశాలలో డ్రగ్స్ వినియోగంతో కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా ప్రభుత్వాలు, సంస్థలు, కుటుంబాలు కృషి చేయాలని కోరారు. ఏ డ్రగ్‌నైనా వాడకూడని విధంగా వాడితే అది డ్రగ్ ఎబ్యూజ్ కిందకే వస్తుందని వివరించారు. డ్రగ్ ఎబ్యూజ్ వల్ల ఆరోగ్యం పాడవుతుందని, ఆర్థిక ఇబ్బందులు ఏర్పడుతాయని తెలిపారు. జ్ఞాపకశక్తి తగ్గిపోతుందని, అసలేమి నేర్చుకోలేని స్థితికి చేరుకుంటారని, అందుకే విద్యార్థులు డ్రగ్స్ జోలికి వెళ్లకూడదని తెలిపారు. జిల్లా యువజన సంక్షేమ శాఖ, జిల్లా ఉపాధి కల్పనా శాఖ అధికారి సోమ శివారెడ్డి మాట్లాడుతూ డ్రగ్ వ్యాపారులు విద్యార్థులబలహీనతలను అవకాశం చేసుకొని వారి డ్రగ్ ఊబిలోకి లాగుతున్నారని అన్నారు. ఇలాంటి వారితో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సెట్కూరు పర్యవేక్షకులు శ్యాంబాబు, కళాశాల ప్రిన్సిపాల్ జీవరత్నం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కష్ట సుఖాలు, అనురాగం, ఆత్మీయ బంధాలు కలగలసిన అద్భుత ప్రపంచమే కుటుంబం. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు, నాగరికతకు మూలం ఉమ్మడి కుటుంబం. పూర్వం సమష్టి కుటుంబంలో తల్లి తండ్రుల నీడలో అన్నదమ్ములు, అక్కాచెల్లెల్లు, కొడుకులు, కోడల్లు అంతా కలిసి పరస్పర సహకారంతో ప్రేమాభిమానాలతో పదిమంది మెచ్చుకునే విధంగా సుఖశాంతులతో కొనసాగించేవారు. ఎప్పుడూ ఏ సమస్య వచ్చినా ఒకరినొకరు సంప్రదించుకుంటూ పరిష్కార మార్గాన్ని తెలసుకునే వారు. ప్రస్తుత కాలంలో కుటుంబ వ్యవస్థ బలహీనపడుతున్న నేపథ్యంలో కుటుంబాల విలువలను తెలియజేసేందుకు ఐక్యరాజ్య సమితి 1993 మే 15న అంతర్జాతీయ కుటుంబ దినోత్సవాన్ని ప్రకటించింది.



కలసిఉంటే కలదు సుఖం



నంద్యాల కల్చరల్, మే 14(ఆంధ్రజ్యోతి): కుటుంబ వ్యవస్థ నాశనం కాకుండా కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కుటుంబంలో ప్రజాస్వామ్యయుతమైన మార్పులు నెలకొనాలి. పరస్పర గౌరవం, అనుగారం పునాదులుగా కుటుంబ సంబంధాలు బలపడాలి. కులాలు, మతాలు, వర్గాలు ఎన్ని ఉన్నప్పటికీ మనదేశంలోని ప్రజలందరూ ఒకే కుటుంబంగా జీవిస్తున్నారు. అందుకే మనదేశాన్ని ఉదారచరితానాంతు వసుదైక కుటుంబం అన్నారు. ఉమ్మడి కుటుంబాలలో ఉన్న ప్రేమ, ఆప్యాయతలు, అనురాగాలు మరే కుటుంబంలో కనబడవు. పరస్పరం సహకరించుకునే ధోరణి కూడా ఎక్కువగా ఈ కుటుంబాలలో అలవడుతుంది. క్రమశిక్షణాయుత పద్ధతులలో పిల్లలు పెరిగి పెద్దవారవుతారు. పెద్దలను గౌరవించే సంస్కృతి బాగా అలవడుతుంది. ఒకరి కష్టసుఖాలను మరొకరు పంచుకునే మంచి సద్గుణం అలవరుతుంది.

కుటుంబ ప్రాధాన్యతను గుర్తించిన ఐరాస

కుటుంబ వ్యవస్థ బలంగా లేకపోతే సమాజంలో ఎలాంటి దుష్పరిణామాలు ఎదురవుతాయో ఐక్యరాజ్యసమితి గ్రహించింది. కుటుంబ వ్యవస్థ బలహీనమవ్వడం మూలంగా సమాజంలో జరిగే దుష్పరిమాణాలు గ్రహించిన ఐక్యరాజ్యసమితి కుటుంబ వ్యవస్థను పటిష్ఠం చేయడం కోసం 1993, మే 15న అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం ప్రారంభించింది. కుటుంబ వ్యవస్థను ఎందుకు కాపాడుకోవాలో వివరిస్తూ సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించాలని సభ్యదేశాలకు పిలుపునిచ్చింది. ప్రతి సంవత్సరం మే 15 వ తేదీన 'అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం'గా పరిగణించి ప్రజా చైతన్యానికి విస్తృత కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

- సమాజాన్ని, సంస్కృతిని కాపాడేది కుటుంబం
- భారతీయ వ్యవస్థలో ఉమ్మడి కుటుంబానికి ప్రత్యేక స్థానం
- నేడు అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం

అనురాగ బంధాల 'అన్నెం' ఫ్యామిలీ

కర్నూలులోని నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని గెలాక్సీ ఫామ్ హౌస్‌లో అన్నెం ఇంటి పేరుగల కుటుంబం ప్రతిఏటా ఓ రోజు అంతా కలుసుకుని సంతోషంగా గడుపుతారు. అప్పటి ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రస్తుతం ప్రకాశం జిల్లా కంభం మండలంలోని లింగాపురానికి చెందిన అన్నెం కుటుంబీకులు ఆత్మీయ సమ్మేళనం పేరుతో రోజంతా విందువినోదాలతో ఆత్మీయ పలకరింపులతో ఆనందంగా గడుపుతారు. అన్నెం ఉల్లక్కి రెడ్డి, అన్నెం నాంచార రెడ్డి కుటుంబాలకు చెందిన నాలుగు తరాల కుటుంబ సభ్యులు ఉ ద్యోగరీత్యా, వ్యాపారరీత్యా దేశ విదేశాల్లో నివసిస్తున్నారు. వారం తా ఒక చోట చేరి తమ ఆత్మీయతను చాటుకోవడం విశేషం. తాజాగా ఈ ఏడాది ఫిబ్రవరి పదో తేదీన కుటుంబంలోని 150 మంది కలిసి ఉమ్మడి కుటుంబ ప్రాధాన్యతను చాటి చెప్పారు.



ఈ ఏడాది ఫిబ్రవరి పదో తేదీన 150 మందితో కలిసిన అన్నెం కుటుంబం



సీఎం చంద్రబాబుతో మంత్రి ఫరూక్ కుటుంబ సభ్యులు(ఫైల్)

ఎంత బిజీగా ఉన్నా ఫ్యామిలీ కోసం ఓ రోజు...

24 మందితో మంత్రి ఫరూక్ ఉమ్మడి కుటుంబం

నంద్యాల, మే14(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కుటుంబంగా ఉంటే ఆ ఇంట్లో ఎప్పటికి సందడి వాతావరణం ఉంటుందని నిరూపిస్తున్నారు రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్. ఆయనకు ఐదుగురు కుమారులు, ఒక కుమార్తె. భగవంతుడి దయతో ఇప్పటికీ ఉమ్మడి కుటుంబంగానే తాము కొనసాగుతున్నామని ఆయన చెప్పుకొచ్చారు. హైదరాబాదు, నంద్యాలలో నివాసం ఉంటున్నాం. మొత్తంగా మా ఉమ్మడి కుటుంబంలో 24 మంది ఉన్నాం. నేను మంత్రి హోదాలో ఎంత బిజీగా ఉన్నప్పటికీ వారంలో ఒక రోజు ఫ్యామిలీ కోసం కేటాయిస్తాను. ఆ ఒక్క రోజూ అందరూ కలిసి పిక్నిక్ వెళ్లి బయటే కలిసి భోజనం చేస్తాం. మా ఉమ్మడి కుటుంబాన్ని చూసి సీఎం చంద్రబాబు నాయుడు చాలా మురిసిపోయేవారు. అందరూ ఒకే కుటుంబంలో కలిసి ఉండటంలో ఎంతో సంతోషం ఉంటుంది. ఉమ్మడిగా ఉంటేనే ఏదైనా సాధించేందుకు వీలుగా ఉంటుంది. ఉమ్మడి కుటుంబ బంధం ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఇటీవల నా సతీమణి మృతి చెందడం కుటుంబానికి తీరని లోటుగా మారింది. భవిష్యత్‌లో కూడా మా కుటుంబం ఉమ్మడిగా ఉండాలని కోరుకుంటున్నా. ఇదే తరహాలో ప్రతిఒక్కరూ ఆలోచిస్తే బాగుంటుంది.

కుటుంబ బంధాలు బలపడాలి



భావితరాల ఉజ్వలభవితకు దిశానిర్దేశం, ప్రేమ, వాత్సల్యం అన్నీ ఉమ్మడి కుటుంబం నుంచే అలవాటు అవుతాయి. వియ్యం నెయ్యం, సోదరభావం కలగలసిన భారతీయ కుటుంబం నిజంగా వసుదైక కుటుంబమే. పాత తరాలకు ఆసరాగా భావితరాలకు ఆలంబనగా విలువల పునాదులపై నిలబడేది కుటుంబం. కుటుంబ బంధాలు బలపడితే విలువలతో కూడిన సమాజం ఏర్పడుతుంది. ఉమ్మడి కుటుంబంలో ఉన్న ఆనందం విడిగా ఉంటే రాదు.

– శంకర్ రెడ్డి, రిటైర్డ్ ఉద్యోగి, నంద్యాల

సహకారానికి తొలి వేదిక కుటుంబం



జీవనశైలిలో కొత్త అనుభవాలెదురైనా ఏనాటికానాడు నూతనత్వాన్ని సంతరించుకున్నది కుటుంబం. భారతీయ జీవన శైలిలో కుటుంబానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. నైతిక విలువలకు పెద్దపీట వేసి పిల్లలను తీర్చిదిద్దేది ఉమ్మడి కుటుంబంలోనే. కష్టాలను కలసికట్టుగా పరిష్కరించుకుంటూ ఉమ్మడి కుటుంబంగానే ఉంటే మంచిది. విడిపోయి దూరంగా ఉంటే భవిష్యత్ పిల్లలకు ఎవరు మంచి, చెడుల గురించి చెబుతారు.

– వీరబ్రహ్మం, రిటైర్డ్ ఉపాధ్యాయుడు, నంద్యాల

ఆడ ఏడిస్ దోమకాటుతో డెంగీ

- డీఎంహెచ్‌వో డా.పి.శాంతికళ
- రేపు జాతీయ డెంగీ నివారణ దినోత్సవం

కర్నూలు హాస్పిటల్, మే 14 (ఆంధ్రజ్యోతి): ఆడ ఏడిస్ దోమకాటుతో డెంగీ వైరస్ వ్యాప్తి చెందుతుందని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ అన్నారు. బుధవారం డీఎంహెచ్‌వో చాంబర్‌లో ఆమె ప్రోగ్రాం ఆఫీసర్లతో కలిసి జాతీయ డెంగీ దినోత్సవ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీన జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హఠాత్తుగా వచ్చే తీవ్రమైన జ్వరం, తలనొప్పి, కీళ్ల నొప్పులు, ఆకలి మందగించడం, వాంతులు డెంగీ వ్యాధి లక్షణాలు అన్నారు. దోమలు కుట్టకుండా దోమతెరలు వాడటం, ముందస్తు జాగ్రత్తల చర్యలతో డెంగీని నివారించొచ్చునన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి ఏ.నూకరాజు, డీఐవో డా.నాగప్రసాద్, ఆర్‌బీఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్ డా.శైలేష్ కుమార్, డీపీఎంవో డా.ఉమా, డెమో శ్రీనివాసుల శెట్టి, జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి డా.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ శశికళ

ఏపీఆర్‌డీసీ సెట్‌లో గూడూరు విద్యార్థి ప్రతిభ

రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు



కోటకొండ విజయ్

కర్నూలు ఎడ్యుకేషన్, మే 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గురుకుల రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ సెట్‌లో గూడూరు విద్యార్థి ప్రతిభ కనబరిచాడు. మండలంలోని మునగాలకి చెందిన చిన్నరాముడు కుమారుడు కోటకొండ విజయ్ 109/150 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిచాడు. బుధవారం గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. బీఎస్సీ జువాలజీ గ్రూపు విభాగంలో నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మంగరాజ కుమారుడు కే.కిరీటి 74/150 మార్కులతో రాష్ట్ర స్థాయిలో ర్యాంకు సాధించాడు.

గాంధీనగర్‌లో యువకుడి మృతి

కర్నూలు క్రైం, మే 14 (ఆంధ్రజ్యోతి): టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గాంధీ నగర్‌లో శరణ్య ఎన్‌క్లేవ్ అనే భవనంపై నుంచి కింద పడి శివ(20) అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. వెల్దుర్తి మండలం శ్రీరంగాపురం గ్రామానికి చెందిన జయరాముడు గొర్రెల పెంపకంతో జీవనం చేస్తుంటాడు. ఈయనకు ఇద్దరు కొడుకులు సంతానం. పెద్ద కొడుకు శివ ఇంటర్ పూర్తి చేశాడు. ఈ నెల 1వ తేదీ నుంచి అబ్దుల్లాఖాన్ ఎస్టేట్‌లో ఉన్న ఓ రెస్టారెంటులో వెయిటర్‌గా పనిచేస్తున్నాడు. ఈ రెస్టారెంటుకు సంబంధించిన గాంధీనగర్‌లోని శరణ్య ఎన్‌క్లేవ్ అనే భవనంలో శివ, ఇదే రెస్టారెంటులో పని చేసే శ్రీనివాసులు, హరి, కృష్ణ నివాసం ఉంటున్నారు. బుధవారం భవనంపై నుంచి పడ్డాడు. ఇదే రూములో నివాసం ఉండే హరి, మరి కొంత మంది కలిసి వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తన కుమారుడి మృతిపై శ్రీనివాసులు, హరి, కృష్ణ, రెస్టారెంటు మేనేజర్ మహ్మద్ రఫీపై అనుమానం ఉందని యువకుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగరాజు తెలిపారు. మృతుని అరచేతిపైన తండ్రి ఫోన్ నెంబర్లు రాసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు.

శ్రీశైలంలో మద్యం పట్టివేత

శ్రీశైలం, మే 14(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానం టోల్‌గేట్ వద్ద బుధవారం సీఐ జి.ప్రసాదరావు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ఇద్దరు మహిళలు ఆర్టీసీ బస్సులో మద్యం బాటిళ్లను తీసుకు వస్తుండగా పోలీసులు పట్టుకున్నారు.



మద్యం సీసాలతో పోలీసులు

శ్రీశైలం గ్రామానికి చెందిన బీబీ, పిక్కిలి రేణుక సున్నిపెంట నుంచి మద్యం బాటిళ్లు తీసుకు వస్తుండగా స్సిబందితో కలిసి వారిని అదుపులోనికి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 50 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

భర్త మృతిని తట్టుకోలేక ఆత్మహత్య

- అనాథగా మారిన 18 నెలల చిన్నారి


లలిత (ఫైల్)

ఉయ్యాలవాడ, మే 14(ఆంధ్రజ్యోతి): భర్త మృతిని జీర్ణించుకోలేక భార్య ఆత్మహత్య చేసుకున్నది. ఈ ఘటన ఉయ్యాలవాడ మండలంలోని ఆర్.పాంపల్లె గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పొగాకు నారాయణ ఈ నెల 6న మట్టి మిద్దె కూలి హఠాత్తుగా మృతి చెందాడు. దీన్ని జీర్ణించుకోలేక భార్య పొగాకు లలిత(35) బుధవారం తెల్లవారుజాము విషద్రావణాన్ని తాగింది. వాంతులు చేసుకుంటుం డగా తల్లి నారాయనమ్మ గమనించి, చుట్టు పక్కల వారికి చెప్పింది. వారు ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి అక్కడ ప్రథమ చికిత్స చేయించి అక్కడ నుంచి నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందింది.

అనాథగా మారిన చిన్నారి

మృతులు లలితమ్మ, నారాయణకు మూడు ఏళ్ల క్రితం వివాహం అయింది. వీరికి 18 నెలల క్రితం చిన్నారి పుట్టింది. వీరిద్దరూ మృతి చెందటంతో చిన్నారి అనాథగా మారింది. పాలు తాగే వయస్సులేనే తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారిని చూసినవారు కంటతడి పెట్టారు.

సారా స్థావరాలపై దాడులు

నందికొట్కూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు పట్టణం నుంచి కొణిదేలకు వెళ్లే రస్తా జగనన్న కాలనీలో సారా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు బుధవారం దాడులు చేశారు. సీఐ రామాంజనేయులు మాట్లాడుతూ నీలి షికారి కాలనీకి చెందిన షికారి రవి (30), షికారి నానాసింగ్ (32), షికారి భారతి (45) అనేటువంటి ముగ్గురు వ్యక్తులు మంగలి శ్రీనివాసులు(37) ఇంటిని అద్దెకు తీసుకుని సారా తయారు చేస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు చేసి 132 లీటర్ల సారా సీజ్ చేసి 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామన్నారు. అనంతరం మంగళి శ్రీనివాసులును, షికారి రవిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిం చామన్నారు. అలాగే షికారి నానా సింగ్ పరారీలో ఉన్నారు. షికారి భారతి పై నమోదైన కేసులో జిల్లా సబ్ జైలులో ఉన్నట్లు సమాచారం. ఆమె పై కూడా కేసు నమోదు చేసి వీరిని కూడా అరెస్టు చేస్తామని తెలిపారు. బెల్లం సరఫరా చేసిన షికారి రవిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎక్సైజ్ ఎస్ఐ జఫరుల్లా, సిబ్బంది శంకర్ నాయక్, పద్మనాభం, కుమారి కానిస్టేబుళ్లు మధుసూదన్ ప్రసాద్, శివన్న, వీఆర్వో మాధవస్వామి, వీఆర్ఏ మహేష్ పాల్గొన్నారు.

ఆంగ్ల భాషపై పట్టు సాధించాలి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ట్రస్టు సభ్యులు

కర్నూలు అర్బన్, మే 14 (ఆంధ్రజ్యోతి): ఆంగ్ల భాషపై పట్టు సాధిస్తేనే ఉద్యోగాలకు అవకాశాలు లభిస్తాయని పినాక కోర్సు డైరెక్టర్, రాయలసీమ విద్యార్థి పోరాట సమితి అధ్యక్షుడు రవికుమార్ తెలిపారు. అందుకోసమే ఈనెల 17వ తేదీ నుంచి ఉచితంగా స్పోకన్ ఇంగ్లీష్, ఇంటర్వ్యూ స్కిల్స్‌పై శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్నామని పినాక కోర్సు డైరెక్టర్, రాయలసీమ విద్యార్థి పోరాట సమితి అధ్యక్షుడు రవికుమార్ తెలిపారు. పినాక ప్రజాసాధికార ట్రస్టు, హైదరాబాద్ ఇన్‌కం టాక్స్ అడిషనల్ కమిషనర్ బి.యాదగిరి, అమీలియో హాస్పిటల్ అధినేత డాక్టర్ లక్ష్మీప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశామన్నారు. నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో కరపత్రాలను ఆవిష్క రించారు. నగరంలోని ఎన్ఆర్‌పేట ఎదురుగా శ్రీలక్ష్మి హైస్కూల్‌లో శిక్షణ ఉంటుందని విద్యార్థులకు ఉచిత శిక్షణ, మెటీరియల్, మధ్యాహ్న భోజనం, అమ్మాయిలకు ఉచిత హాస్టల్ వసతి ఏర్పాటు చేశామన్నారు. వివరాలకు 9177764147, 9640969891లో సంప్రదించాలన్నారు.

కాంగ్రెస్ పార్టీ నేత లక్ష్మీనారాయణ హత్యకేసులో

ఏడుగురి అరెస్ట్

ఆలూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధ్యక్షుడు చిప్పగిరి లక్ష్మీనారాయణ హత్యకేసులో మరో ఏడుగురిని బుధవారం అనంతపురం జిల్లా విడపనకల్ మండలం పెంచికలపాడు సమీపంలో అరెస్టు చేసినట్లు అదనపు ఎస్పీ హుసేన్‌పీరా తెలిపారు. ఆలూరు సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. గత నెల 27న గుంతకల్లు-చిప్పగిరి మార్గ మధ్యలో దారుణహత్యకు గురైన కాంగ్రెస్ నాయకుడు లక్ష్మీనారా యణ హత్య కేసులో ఆయన కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే మరో 11 మంది పాత్ర ఉన్నట్లు విచారణలో వెల్లడైంది. ఇప్పటికే ఈ కేసులో 10 మందిపై కేసులు నమోదు చేయగా అందులో రాజేష్, గౌసియా, సౌభాగ్య, గుమ్మనూరు నారాయణను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిం చామని చెప్పారు. ఇందులో ప్రధాన నిందితుడిగా ఉన్న గుంతకల్లుకు చెందిన సారాయి పెద్దయ్య, మొలగవల్లి గ్రామానికి చెందిన మేకల శ్రీనివాసులు, గుంతకల్లుకు చెందిన బోయ గోవిందు,


నిందితుల అరెస్టును చూపుతూ వివరాలను వెల్లడిస్తున్న ఏఎస్పీ హుస్సేన్ పీరా, డీఎస్పీ, సీఐ, ఎస్ఐలు

బోయ రాము, వడ్డే నవీన్, దొడ్ల మనోహర్, రామదుర్గానికి చెందిన జీర్ల ధనుంజయ లక్ష్మీనారాయణ హత్యలో పాలుపంచుకున్నట్లు తెలిపారు. అందరూ కలిసి లక్ష్మీనారాయణను పథకం ప్రకారం హత్య చేశారని చెప్పారు. కేసులు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారించి ఇంకా ఎవరి పాత్ర ఉందో గుర్తిస్తామన్నారు. వీరందరినీ అరెస్టు చేసి హత్యకు ఉపయోగించిన కత్తులు, ఇనుప రాడ్లు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. చిప్పగిరి లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వైకుంఠం శివప్రసాద్, వైకుంఠం మల్లికార్జున, కొండ రామాంజనేయులు, అరికెర మల్లేష్‌పై కేసు నమోదు చేసి వారి పాత్రపై సాంకేతిక కోణాల్లో విచారించగా ఇందులో వారి పాత్ర ఎక్కడా లేదన్నారు. ఎవరైనా ఆధారాలు ఇస్తే విచారించి తదుపరి చర్యలు తీసుకుంటామని అదనపు ఎస్పీ తెలిపారు. సమావేశంలో డీఎస్పీ వెంకట్రామయ్య, సీఐ రవిశంకర్‌రెడ్డి, ఆలూరు, చిప్పగిరి, హొళగుంద ఎస్ఐలు మహబూబ్‌బాషా, శ్రీనివాసులు, దిలీప్ కుమార్, పాల్గొన్నారు.

అందుబాటులో అత్యాధునిక చికిత్సలు

- కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు
- స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో సర్జరీ సేవలు ప్రారంభం


ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్‌ను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, మే 14 (ఆంధ్రజ్యోతి): కర్నూలు స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో రాష్ట్రంలోనే అత్యాధునిక క్యాన్సర్ చికిత్సలు అందుబాటులో ఉన్నాయని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌లో సర్జరీ సేవలను ఆయన క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణప్రకాష్‌తో కలిసి ప్రారంభించారు. కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఇప్పటికే ప్రభుత్వ సర్వజన వైద్యశాల వైద్య రంగంలో విశిష్టమైన సేవలు అందిస్తోందని, సర్జికల్ అంకాలజీ, జనరల్ అంకాలజీలలో ఆపరేషన్లను వైద్యులు చేయనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలోనే గర్వించదగ్గ హాస్పిటల్‌ను తీర్చిదిద్దేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

కార్యక్రమంలో కర్నూలు జీజీహెచ్ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ బీవీ రావు, స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ బి.హేమనళిని, అనస్థీషియా హెచ్‌వోడీ డా.విశాల, ప్రొఫెసర్ డా.రామశివ నాయక్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డా.కిరణ్ కుమార్, వైద్యులు పాల్గొన్నారు.

వినియోగదారులను మోసం చేస్తే చర్యలు

- తూకాల యంత్రాలకు ముద్ర వేయించుకోవాలి
- తూనికలు, కొలతల శాఖ జాయింట్ కంట్రోలర్ గోపికృష్ణారెడ్డి


మాట్లాడుతున్న జాయింట్ కంట్రోలర్ గోపికృష్ణారెడ్డి

కర్నూలు న్యూసిటీ, మే 14(ఆంధ్రజ్యోతి): దుకాణదారులు వినియోగదారులను మోసం చేస్తే చర్యలు తప్పవని తూనికలు, కొలతల శాఖ జాయింట్ కంట్రోలర్ గోపికృష్ణారెడ్డి అన్నారు. బుధవారం ప్రపంచ లీగల్ మెట్రాలజీ దినోత్సవాన్ని పురస్కరించుకొని షరాఫ్‌బజార్‌లో బంగారు వ్యాపారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. తూకాల యంత్రాలు సంవత్సరానికి ఒక్కసారి డిపార్ట్‌మెంట్ ద్వారా సరిచే యించుకుని ముద్ర వేయించు కోవాలన్నారు. ప్రతి దుకాణంలో వెరిఫికేషన్ సర్టిఫికెట్ డిస్‌ప్లే చేయాలన్నారు. తుకాల యంత్రా లను ప్రతి రోజు వ్యాపారం ప్రారంభానికి ముందు బెలియన్ టెస్ట్ వెయిట్స్ ద్వారా చెక్ చేసుకోవాలన్నారు. డిప్యూటీ కంట్రోలర్ సీహెచ్.దయాకర్‌రెడ్డి, అసిస్టెంట్ కంట్రోలర్ శ్రీరాముడు పాల్గొన్నారు.

48 గంటల్లో 74 కేసులు..

నంద్యాల టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గడిచిన 48 గంటల్లో మద్యం తాగి, బహిరంగ మద్యపానం చేసిన వారిపై జిల్లాలో 174 కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా తెలిపారు. శాంతిభద్రతలో బాగంగా జిల్లాలో విస్తృతంగా విజిబుల్ పోలీసింగ్ నిర్వహించామన్నారు. సారా, అక్రమ మద్యం విక్రదారులపై 3కేసులు, 30 లీటర్ల నాటుసారా 39 క్వార్టర్ మద్యం సీసాలు స్వాదీనం చేసుకున్నట్లు తెలిపారు. 48 గంటల్లో వాహన చట్టాన్ని ఉల్లఘించిన వారిపై 599 మందిని గుర్తించి 4,62,265 జరిమానాలు విధించినట్లు తెలిపారు. అలాగే 131 మంది నుంచి రూ.64,210 జరిమానాలు రీకవరి చేసినట్లు చెప్పారు. రోజూ రాత్రిళ్లు పహరా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

గడివేముల, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెసరవాయి గ్రామానికి చెందిన మధుసూదన్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెసరవాయి గ్రామానికి చెందిన చిన్న రఘుస్వామిరెడ్డి జొన్న ధాన్యాన్ని గడిగరేవుల గోడౌన్‌కు తీసుకెళ్లారు. జొన్నలు అన్‌లోడ్ చేయడానికి ట్రాక్టర్‌ను ముందుకు తీసుకెళ్లే విషయంలో మధుసూదన్‌రెడ్డి, చిన్న రఘుస్వామిరెడ్డి ఘర్షణ పడ్డారు. మదుసూదన్‌రెడ్డి రాయితో చిన్న రఘుస్వామి రెడ్డిపై దాడి చేయగా గాయాలపాలయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మార్కెట్ కార్యదర్శిపై చార్జెస్ ఫ్రైమ్

- ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్ ఉత్తర్వులు జారీ
- 15 రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నంద్యాల, మే14(ఆంధ్రజ్యోతి): నంద్యాల మార్కెట్‌యార్డులో జరిగిన అవకతవకలపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన పైసా వసూల్..!, అక్రమార్కుల్లో అలజడి..? ఆ ఇద్దరే కీలకం' కథనాలపై ఆ శాఖ ఉన్నతాధికారులు సీరియస్‌గా స్పందించారు. ఈ నేపథ్యంలో ఆశాఖ జేడీ రామాంజినేయులు లోతుగా విచారణ చేసి ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందజేశారు. దీంతో తాజాగా ఆశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్ సదరు కార్యదర్శి ఎం.కల్పనపై తగిన అభియోగాలను మోపుతూ చార్జెస్ ఫ్రేమ్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

నిధులు దుర్వినియోగమైనట్లు..

ఉత్తర్వులు ప్రకారం 8 రకాల ఆర్టికల్స్ కింద రూ. 30,40,361 నిధులు సదరు మార్కెట్‌యార్డు నిధుల్లో దుర్వినియోగమైనట్లు అభియోగాలు ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రదానంగా పశువులు సంత, గోడౌన్ అద్దెలు, సిబ్బంది నియామకం, ఉన్నతాధికారుల అనుమ తులు లేకుండా సిబ్బందిని మార్పులు చేయడం, స్టేషనరీ, తదితర సామగ్రి కొనుగోలు వంటి అంశాల్లో ఎక్కువగా దుర్వినియోగం చేసినట్లు గుర్తించారు. పైగా నిబంధనలకు విరుద్ధంగా ఓ ఉద్యోగికి కారు రుణం మంజూరు కూడా చేసినట్లు గుర్తించారు. ఈ నేప థ్యంలో వచ్చిన అభియోగాల పరంగా సదరు అధికారి 15 రోజుల్లో తగిన వివరాలతో కూడిన సమగ్ర నివేదికను ఆశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి అందజే యాల్సి ఉందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వేధింపుల కేసు నమోదు

కర్నూలు క్రైం, మే 14(ఆంధ్రజ్యోతి): తాలుకా పోలీస్‌స్టేషన్ పరిధిలో వెంకాయపల్లెకు చెందిన హరిప్రసాద్ అనే వ్యక్తిపై వేధింపుల కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీధర్ తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగి అయిన హరిప్రసాద్‌కు ఈ-తాండ్రపాడు చెందిన ఉమాదేవితో నాలుగు నెలల కింద పెళ్లయిందన్నారు. పెళ్లయిన కొద్ది రోజుల నుంచి అదనపు కట్నం కోసం తనను వేధిస్తున్నట్లు ఉమాదేవి ఫిర్యాదు చేసింది. బుధవారం వెంకాయపల్లెలో తన భర్త ఇంటి ముందు ధర్నా కూడా చేసింది. భర్త, బంధువులు ఇంటికి తాళం వేసి వెళ్లిపోవడంతో పోలీసు లను ఆశ్రయించింది. ఉమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సైనిక శక్తి భారతావనికే గర్వకారణం

- శ్రీశైలం ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.కొండయ్య
- అలరించిన 'జై జవాన్' కల్చరల్ ఫెస్ట్ కళారూపాలు



భరతమాత చిత్రపటానికి క్షీరాభిషేకం , దేశభక్తి నృత్య ప్రదర్శనలు చేస్తున్న కరీముల్లా బృందం

కర్నూలు కల్చరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడి అనంతరం దాయాది పాక్‌పై మనదేశ సైనిక శక్తి ప్రదర్శించిన తెగువ యావత్ భారతావనికే గర్వకారణమని శ్రీశైలం ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.కొండయ్య అన్నారు. నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో వారం రోజుల పాటు ఏర్పాటు చేసిన 'జై జవాన్' కల్చరల్ ఫెస్ట్ ఐదోరోజు బుధవారం కార్యక్రమాలను పి.కొండయ్య ప్రారంభించారు. తొలుత భరత మాత చిత్ర పటానికి క్షీరాభిషేకం నిర్వహించి, జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదులను మట్టుబెట్టిన భారత సైన్యం పాత్ర ప్రపంచ పటంలో గొప్పగా నిలుస్తుందన్నారు. రాయలసీమ వాసి మురళీ నాయక్ వీరమరణం బాధాకరమని, ఆయనకు శ్రద్ధాంజలి ఘటించారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ వారం రోజుల పాటూ ఏర్పాటు చేసిన జై జవాన్ కల్చరల్ ఫెస్ట్‌కు ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందన్నారు. జవాన్ల త్యాగనిరతిని గుర్తిస్తూ కళాకారులు, గాయకులు, నాట్యాచార్యులతో దేశభక్తిని ప్రబోధించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీజీవీ కళాక్షేత్రం కార్యవర్గ సభ్యులు యాగంటీశ్వరప్ప, పి.రాజారత్నం, జీవీ శ్రీనివాసరెడ్డి, కేవీ రమణ, బాలవెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు సాంఘిక నాటిక ప్రదర్శన

టీజీవీ కళాక్షేత్రంలో కొనసాగుతున్న కల్చరల్ ఫెస్ట్‌లో ఆరోరోజు గురువారం సాయంత్రం 6:30 గంటలకు 'బావా ఎప్పుడు వచ్చితీవు' హాస్య సాంఘిక నాటిక ప్రదర్శిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య తెలిపారు. కళాక్షేత్రం సభ్యుడు సంగా ఆంజనేయులు దర్శకత్వంలో ప్రదర్శిస్తున్న ఈ నాటికలో కళాకారులు సంగా ఆంజనేయులు, మహ్మద్ మియ, చల్లా నవీన్ కుమార్ నాయుడు, బి.భాస్కర్, గొల్లపూడి రేణుక ప్రధాన పాత్రలు పోషిస్తారని తెలిపారు. అనంతరం నాట్యాచార్యులు నాగసాయి ప్రదీప్ శిష్య బృందంతో దేశభక్తి గీతాల నృత్య రూపకాలు ఉంటాయన్నారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

వీరజవాన్‌కు ఉపాధి కూలీల నివాళి



మురళీనాయక్‌కు సెల్యూట్ చేస్తున్న ఉపాధి కూలీలు

బండిఆత్మకూరు, మే 14(ఆంధ్రజ్యోతి): భారత్, పాకిస్తాన్ సైన్యం మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో వీరమరణం చెందిన జవాన్ మురళీ నాయక్‌కు కూలీలు నివాళి అర్పించారు. బుధవారం మండలంలోని లింగాపురం గ్రామంలో ఉపాధి పనుల వద్ద మురళీనాయక్ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం జైభారత్ అంటూ కూలీలంతా సెల్యూట్ చేశారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు: డీఎంహెచ్‌వో



వైద్య సేవల వివరాలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

బండిఆత్మకూరు, మే 14(ఆంధ్రజ్యోతి): వైద్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ హెచ్చరించారు. మండలంలోని బి.కోడూరు గ్రామంలో బుధవారం నిర్వహిస్తున్న 104 సంచార చికిత్స కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం సబ్ సెంటర్‌లో ప్రజలకు అందిస్తున్న వైద్య పరీక్షలు, చికిత్సల రిజిస్టర్లను, గర్భిణుల వివరాలు, సిబ్బంది హాజరు, ఎన్‌సీడీసీడీ సర్వే రికార్డులను డీఎంహెచ్‌వో తనిఖీ చేశారు. ప్రజలకు వైద్య సేవలు అన్ని వేళలా అందించాలన్నారు. శింగవరం గ్రామంలోని సబ్‌సెంటర్‌ను ఎంపీడీవో దస్తగిరి తనిఖీ చేసి రికార్డులను పిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ భావన, పీఏస్‌లు శ్రీకాంత్, రాంగోపాల్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'కౌలు కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలి'

ఆత్మకూరురూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): కౌలు రైతులు కౌలు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏవో డి.విష్ణువర్ధన్‌రెడ్డి సూచించారు. మండలంలోని కరివేన గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో బుధవారం కౌలు రైతుల సదస్సు నిర్వహించి పలు సూచనలు చేశారు. కౌలు పత్రాలు పొందడం ద్వారా పంట నమోదు, అన్నదాత సుఖీభవ, రాయితీపై విత్తనాలు, పంటల బీమా, పంట నష్టపరిహారం తదితర వ్యవసాయ పథకాలు పొందేందుకు అర్హులవుతారని చెప్పారు. కౌలు రైతుకు పండించిన పంటపై మాత్రమే హక్కు కలిగి ఉంటారని, భూ యజమానికి ఎటువంటి ఇబ్బంది తలెత్తదని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహిస్తున్న ఈ కౌలు రైతు సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

స్థలాలు ఆక్రమించిన వారిపై కేసులు

- తంగడంచ విత్తనోత్పత్తి క్షేత్ర భూములను పరిశీలించిన ఆర్డీవో నాగజ్యోతి
- ప్రభుత్వ భూముల్లో బోర్డులు ఏర్పాటు చేయాలని తహసీల్దార్‌కు ఆదేశం



జూపాడుబంగ్లాలో ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో నాగజ్యోతి

జూపాడుబంగ్లా, మే 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకున్న వారిపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేసి కేసులు నమోదు చేయించాలని ఆర్డీవో నాగజ్యోతి అధికారులను ఆదేశించారు. జూపాడు బంగ్లాలో తంగడంచ విత్తనోత్పత్తి క్షేత్రానికి సంబంధించిన భూములు ఆక్రమణకు గురైనట్లు వ్యవసాయశాఖ అధికారులు ఫిర్యాదు చేయడంతో ఆక్రమణకు గురైన స్థలాలను పరిశీలించారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకునే సమయంలో స్థలాల్లో దిగిన ఎక్సకవేటర్ యజమానులపై చర్యలు తీసుకుని యంత్రాన్ని సీజ్ చేయాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్‌ను ఆదేశించారు. ఆక్రమించుకున్న స్థలాల వద్ద ప్రభుత్వ స్థలంగా బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. తంగడంచలో ఏర్పాటు చేసిన జైన్ పరిశ్రమను పరిశీలించారు. జైన్ పరిశ్రమ ఏర్పాటు చేసినప్పటి నుంచి ఏమేమీ ఉత్పత్తులు చేశారని కంపెనీ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. మౌలిక సదుపాయాలు నీటిసరఫరా చేస్తే పరిశ్రమను ముందుకు తీసుకెళుతామని ఆర్డీవోకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోపికృష్ణ, ఉప తహసీల్దార్లు సత్యదీప్, నాగన్న, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఇది ప్రజా ప్రభుత్వం

- నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య



కొణిదేలలో ఇంటి పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు రూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): ఇది ప్రజా ప్రభుత్వమని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. నందికొట్కూరు మండలంలోని కొణిదేల గ్రామంలో ఎమ్మెల్యే పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో గ్రామంలో ఇల్లు లేని పేదలను గుర్తించి అర్హులైన వారికి బుధవారం ఇళ్ల పట్టాలను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పేదల కోసం పనిచేస్తోందన్నారు. ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను ఒకొక్కటిగా నెరవేర్చుకుంటూ పోతున్నామని అన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆజద్వర్యంలో ప్రతిఒక్కరూ తమవంతుగా నిరంతరం శ్రమించాలని తెలిపారు. అనంతరం గ్రామంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వచ్చిన రూ. 1,02,620 లక్షల చెక్కును నిశాంత్ తల్లి మహేశ్వరికి అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు మాండ్ర సురేంద్రనాథరెడ్డి, నందికొట్కూరు మండల కన్వీనర్ ఓబుల్‌రెడ్డి, హరీష్‌రెడ్డి, భాస్కరెడ్డి, మహేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఆత్మకూరు, మే 14(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం నందు గురువారం ఉదయం 11గంటలకు మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సుబ్రహ్మణ్యం తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ప్రతి మూడు నెలలకు ఓ సారి జరిగే సర్వసభ్య సమావేశంలో భాగంగా గురువారం ఉదయం 11గంటలకు ఎంపీపీ తిరుపాలమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు. ప్రత్యేకించి ఆయా శాఖ అధికారులు తమ శాఖకు సంబంధించి ప్రగతి నివేదికలతో మండల మీట్‌కు హాజరు కావాలని సూచించారు.

'జగన్ చిత్రాలను తొలగించాలి'

వెలుగోడు, మే 14(ఆంధ్రజ్యోతి): వెలుగోడు మండలంలో కూటమి ప్రభుత్వం నిరుపేదలకు ఉచితంగా పంపిణీ చేసే వాహనాలపై మాజీ ముఖ్యమంత్రి జగన్ చిత్రాలు, నవరత్న లోగోలు నేటికీ అలాగే దర్శనమిస్తున్నాయని, తొలగించాలని బీజేపీ నాయకులు కోరారు. నాయకులు రాజశేఖరరెడ్డి, మహేశ్, ప్రతాప్ ఆచారి బుధవారం తహసీల్దార్‌ను శ్రీనివాసగౌడ్‌ను కలిసి వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం మారిన కొందరి పనితీరు మారడం లేదని అన్నారు. వెంటనే తొలగించకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

ఎస్‌ఐ బదిలీ

నంద్యాల టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ఎస్పీ కార్యాలయంలో పని చేస్తున్న ఎస్‌ఐ వెంకటేశ్‌ను అన్నమయ్య జిల్లాకు బదిలీ చేశారు. అలాగే అన్నమయ్య జిల్లాలో డీఎస్‌బీలో పని చేస్తున్న ఎస్‌ఐ డి.రమేశ్‌బాబును నంద్యాల జిల్లా కార్యాలయానికి బదిలీ చేశారు. బదిలీలకు సంబంధించి పోలీసు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

'విద్యుత్ చార్జీలు పెంచడం దుర్మార్గం'

నందికొట్కూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచి ప్రజల నడ్డీ విరుస్తోందని, ఇది చాలా దుర్మార్గమని ఎన్ఎస్‌యూఐ నందికొట్కూరు అధ్యక్షుడు సాయి కుమార్ యాదవ్ అన్నారు. బుధవారం ఆయన నందికొట్కూ రులో మాట్లాడుతూ ప్రతి నెలా అధికంగా కరెంటు బిల్లులను వేసి ప్రభుత్వం ప్రజల నుంచి వసూలు చేస్తున్నారన్నారు. రకరకాల పేర్లతో కరెంటు బిల్లుల్లో ఫీజులను వసూలు చేయడం దుర్మార్గమన్నారు. రకరకాల పేర్లతో వేస్తున్న విద్యుత్ చార్జీలను తొలగించి ప్రజలకు ఆర్థిక భారం లేకుండా చూడాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

బాధిత కుటుంబానికి చేయూత

జూపాడుబంగ్లా, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భాస్కరాపురం గ్రామంలో రవణమ్మ అనే మహిళ అనారోగ్యంతో మృతిచెందడంతో గ్రామపెద్దలు స్పందించి ఆర్థిక సాయం అందించారు. గ్రామ సర్పంచ్ మాధవి, గ్రామపెద్దలు గోవిందు, జయరాముడు పాల్గొని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం మహిళ కుటుంబానికి రూ. 10వేలు అందజేశారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన సహాయం కూడా అందేలా చూస్తామని చెప్పారు. కార్యక్ర మంలో నరసింహ, భూషన్న, శ్రీరాములు, పరమేష్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

గోస్పాడు, మే 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో వలసల నివారణకు చేపట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీవో గంగన్న సూచించారు. బుధవారం తేళ్లపురి, పసురపాడు గ్రామాల్లో ఉపాధి పనులను పరిశీలించారు. టెక్నికల్ అసిస్టెంట్ నాగేశ్వరి, ఫీల్డ్ అసిస్టెంటు రమేష్ ఉన్నారు.

'చర్చిని కూల్చడానికి ప్రయత్నాలు'

పాములపాడు, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామ శివార్లలోని జెరూసలేం శాలను అధికారులు కూల్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఇన్‌చార్జిలు యాకోబు, అయ్‌వర్య అన్నారు. బుదవారం వారు మాట్లాడుతూ నేషనల్ హైవే పనుల్లో భాగంగా భూ సేకరణలో తీరని అన్యాయం జరుగుతోందని వాపోయారు. అధికారికంగా ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా చర్చి ప్రహరీని కూల్చారన్నారు. ఈ స్థలం విషయం కోర్టులో ఉందని ఆగస్టు 18న హియరింగ్ ఉన్నట్లు తెలిపారు. కోర్టు తీర్పునకు కట్టుబడి ఉంటామని చెప్పారు. సమావేశవంలో సంఘస్థులు విజయ్, శ్రీను, కర్నాకర్, నేహమ్య, నాగరాజు, ఏసేపు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

- శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి



విద్యార్థిని అభినందిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

వెలుగోడు, మే 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్న తనం నుంచే కష్టపడి చదివి జీవితంలో రాణించాలని, విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సూచించారు. పదో తరగతిలో మండలంలో అత్యధికంగా 596 మార్కులు సాధించిన సాయిస్ఫూర్తిని బుధవారం ఎమ్మెల్యే వేల్పనూరులోని తన ఇంటి వద్ద శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ఉన్నత చదువులలో సైతం బాగా చదివి మంచి ప్రతిభను చాటి, పేరు ప్రతిప్రతిష్టలు తేవాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు హుస్సేన్, ముజీద్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలి

ఆత్మకూరు రూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): మండుతున్న ఎండల దృష్ట్యా చెంచులు పలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి పవన్‌కుమార్ సూచించారు. అమలాపురం చెంచు గూడెంలో బైర్లూటి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో అమలాపురం చెంచు గూడెంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పలు వ్యాధు లకు చికిత్సలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనం తరం గూడెం వాసులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. సీహెచ్‌వో ఖుద్దూస్ బాషా, హెల్త్ అసిస్టెంట్ లత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులందరికీ పని కల్పించాలి: పీడీ



మిడుతూరులో మాట్లాడుతున్న డ్వామా పీడీ వెంకటసుబ్బయ్య

మిడుతూరు, మే 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో అర్హులకు పని కల్పించాలని నంద్యాల డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటసుబ్బయ్య సూచించారు. మిడుతూరు ఎంపీడీవో కార్యాలయంలో ఫీల్డు, టెక్నికల్ అసిస్టెంట్లకు ఎంపీడీవో దశరథ రామయ్య, ఏపీవో నాగమ్మ ఆధ్వర్యంలో మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంపై బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ షబాన తదితరులు పాల్గొన్నారు.

గడివేముల: జాతీయ ఉపాధిహామీ పథకంలో ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని పీడీ వెంకటసుబ్బయ్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధిహామీ పథకం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో వాసుదేవగుప్తా, ఏపీవో వెంకటరమణ, ఉపాధిహామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

ఆవుదూడను రక్షించిన అగ్నిమాపక సిబ్బంది



భుజంపై ఆవుదూడను ఎత్తుకొని నిచ్చెన ఎక్కుతున్న సిబ్బంది

ఆత్మకూరు, మే 14(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని రహమత్‌నగర్ శివార్లలోని పంటపొలాల్లోని ఓ బావిలో ప్రమాదవశాత్తు పడిన ఆవుదూడను అగ్నిమాపక సిబ్బంది రక్షించిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. ఆత్మకూరు పట్టణంలోని రషీద్ అనే వ్యక్తికి చెందిన సుమారు 10ఆవులు పంటపొలాల్లోని పచ్చిక మేస్తున్నాయి. ఈక్రమంలోనే ఓ ఆవు దూడ ప్రమాదవశాత్తు బావిలో పడింది. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. దీంతో ఫైర్‌ఆఫీసర్ భీముడునాయక్ తన సిబ్బందితో కలిసి ఫైర్‌ఇంజన్‌తో అక్కడికి చేరుకున్నారు. తొలుత తాళ్ల సాయంతో బావిలో నుంచి ఆవు దూడను బయటకు తీసేందుకు ప్రయత్నించినప్పటికీ సాధ్యం కాలేదు. దీంతో ఇదే స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న మండ్ల శ్రీనివాసులు బావిలోకి దిగి చావుబతుకుల మధ్యలో ఉన్న ఆవుదూడను తాళ్లతో కట్టేసి నిచ్చెన సాయంతో భుజంపై ఎత్తుకుని బయటకు తీసుకొచ్చారు. ఆయన సాహసాన్ని చూసి అగ్నిమాపక కేంద్రం అధికారి భీముడునాయక్‌తో పాటు అక్కడున్న వారందరు అతన్ని అభినందించారు. కాగా హోంగార్డు శ్రీనివాసులు ఆవుదూడను రక్షించిన దృశ్యాలు స్థానికంగా సోషల్ మీడియాలో కూడా విస్తృతమైన ప్రచారం జరగడం గమనార్హం.

'మోదీ పాలనలో ప్రజల అవస్థలు'

నంద్యాల రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ ఆర్థిక విధానాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో జిల్లాస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలలో భాగస్వామ్యం తగ్గించి ప్రవేట్ కంపెనీల వైపు మొగ్గు చూపుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 20న జరిగే కార్మికుల సమ్మెకు సీపీఎం మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏసురత్నం, నాగరాజు, నాగేశ్వరరావు, నరసింహనాయక్, రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

- నయా ఫాసిస్ట్ విధానాలకు వ్యతిరేకంగా పోరాడదామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం గాంధీ చౌక్‌లోని హమాలీ యూనియన్ కార్యాలయంలో ఫాసిజం విధానాలపై విజయం అనే అంశంపై సమావేశం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగరాజు. పట్టణ కార్యదర్శి లక్షణ్, తోట మద్దులు, పుల్లా నరసింహ, వెంకటలింగం తదితరులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ



క్రీడా పరికరాలను పంపిణీ చేస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల హాస్పిటల్, మే 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాలకు అవసరమైన క్రీడా పరికరాలను బుధవారం కలెక్టర్ రాజకుమారి పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, శాప్ ఆధ్వర్యంలో 50 వేసవి క్రీడా శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. 8నుంచి 14ఏళ్ల చిన్నారులకు ఉచితంగా శిక్షణ ఇచ్చి వారిలో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఈశిబిరం ఉపయోగపడుతుందన్నారు. ప్రతి శిబిరానికి రూ.5వేల విలువచేసే క్రీడాపరికరాలు క్యాంప్ ఇన్‌చార్జికి రూ.1,500 గౌరవ వేతనం, క్యాంప్ నిర్వహణ నిమిత్తం రూ.500 ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. శిబిరాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన క్రీడాకారులకు రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ తీసుకోవాల్సిన ఆసక్తిగల విద్యార్థులు క్రీడా యాప్‌ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎంఎన్‌వీ రాజు, శిక్షకులు, క్యాంప్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి : బైరెడ్డి



కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బైరెడ్డి రాజశేఖరరెడ్డి

నందికొట్కూరు రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతానికి కృషి చేస్తానని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి అన్నారు. కొణిదేల గ్రామంలో వైసీపీ నాయకుడు కొంగర అయ్యన్న ఆధ్వర్యంలో 10 కుటుంబాలకు చెందిన 50 మంది వైసీపీ నాయకులు బుధవారం టీటీడీలో చేరారు. వీరికి బైరెడ్డి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. మొదటగా గ్రామంలో ప్రధాన వీధుల వెంట టీడీపీ నాయకులు కార్యకర్తలు భారీ ఊరేగింపు ర్యాలీ చేపట్టారు. అనంతరం సభ నిర్వహించారు. టీడీపీ లో చేరిన వారిలో వెంకటేశ్వర్లు, అంజనేయులు, ఏసన్న, సోల్మోన్, చెంచన్న, దేవదానం, శేఖర్,నాగన్న, నాగశేషులు తదితరులు ఉన్నారు. బైరెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు రాష్ట్రంలో చేస్తున్న అభివృద్ధి, అమలు అవుతున్న సంక్షేమ పథకాలను చూసి ప్రజల్లో ఒక నూతన ఉత్సాహం వస్తోందని అన్నారు. ఇలాగే ప్రతి గ్రామంలో ప్రజలు టీడీపీకి మద్దతు తెలుపుతూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. టీడీపీ నాయకులు చల్లా వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ కుర్వశివన్న, చల్లాశేఖరెడ్డి, లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయాలి



అబ్బీపురంలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

మహానంది, మే 14 (ఆంధ్రజ్యోతి): సిద్దేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన 9వ వార్షికోత్సవం పురస్కరించుకొని మే 31న రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో సంగమేశ్వరం వద్ద నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని సమితి సభ్యులు పిలుపునిచ్చారు. బుధవారం అబ్బీపురం, ఎం.తిమ్మాపురం, బుక్కాపురం, తమ్మడపల్లి, శ్రీనగరం, మహానంది గ్రామాల్లో కరపత్రాలను సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి ఆధ్వర్యంలో సభ్యులు ఆయా గ్రామాల్లో రైతుల చేత ఆవిష్కరించారు. బొజ్జా మాట్లాడుతూ 2009లో వచ్చిన భారీ వరదలకు శ్రీశైలం రిజర్వాయర్ ప్లంజ్ పూల్ దెబ్బతిందని, రిజర్వాయర్ భద్రత కోసం తక్షణమే మరమ్మతులు చేపట్టాలని రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలకు పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ పాలకులు పట్టించుకోలేదని వాపోయారు. శ్రీశైలం ప్రాజెక్ట్ భద్రత కోసం పూడిక నివారణ కోసం ప్రాజెక్ట్ ఎగువన సిద్ధేశ్వరం అలుగు నిర్మించాలని ఉద్యమాలు చేస్తున్నా పాలకుల్లో స్పందన లేదని విమర్శించారు.

సాక్షి గణపతికి అభిషేకం

శ్రీశైలం, మే 14(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో లోకకళ్యాణం కోసం బుధవారం ఉదయం సాక్షి గణపతి స్వామికి విశేష అభిషేకం, పూజలు నిర్వహించారు. మహా మంగళ హారతులను సమర్పించారు. అలాగే జ్వాలా వీరభద్ర స్వామికి ప్రదోషకాలంలో విశేష అభిషేకం, పూజలు నిర్వహించింది.

- శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో బుధవారం కడపకు చెందిన డి. తిరుపతి బృందంతోసంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది.

వినియోగంలోకి పల్మనరీ ఫంక్షన్ పరీక్ష యంత్రం



జీజీహెచ్ ఓపీడీలో ఏర్పాటు చేసిన పీఎఫ్‌టీ యంత్రం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నంద్యాల హాస్పిటల్, మే 14 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జీజీహెచ్‌లో పల్మనరీ ఫంక్షన్ పరీక్ష యంత్రం గత మూడు నెలలుగా స్టోర్‌రూమ్‌లో వృథాగా ఉన్న విషయాన్ని ఏప్రిల్ 19న మూలన పడేశారు అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురించింది. ఈ విషయంపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.మల్లేశ్వరి స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి పీఎఫ్‌టీని జీజీహెచ్‌లో ఓపీడీ విభాగంలో 12వ నెంబర్ గదిలో ఏర్పాటు చేశారు. ఊపిరితిత్తుల పనితీరును పరీక్షించే యంత్రం ప్రజలకు అందుబాటులోకి రావడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రిలో గదుల కొరత ఉండటంతో ఒకే గదిలోనే అటు ఓపీ, ఇటు పరీక్ష నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

- నంద్యాల జీజీహెచ్‌లో సిటీస్కాన్ పనిచేయకపోవడంతో గత కొన్నిరోజులుగా రోగులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఈ నెల 6వ తేదీన జీజీహెచ్‌లో పనిచేయని సిటీస్కానర్ అనే శీర్షికన ప్రచురించింది. రోగుల ఇబ్బందుల దృష్ట్యా ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.మల్లేశ్వరి స్పందించి ప్రత్యామ్నాయంగా ఎన్ఆర్ఐ అకాడమీ సంస్థతో మాట్లాడి రోగులకు ప్రైవేట్ సీటీ స్కాన్ సెంటర్‌లో స్కానింగ్ చేసేందుకు ఏర్పాటు చేశారు. ఎన్ఆర్ఐ అకాడమీ నంద్యాలలోని ఫోకస్ డయాగ్నోస్టిక్స్ సెంటర్‌తో టై అప్ అయి అక్కడ ఉచితంగానే రోగులకు అత్యవసరంలో సీటీ స్కాన్ చేయిస్తున్నారు. ఈ నెల 7నుంచి స్కానింగ్‌లు బయట చేయిస్తున్నారు. ఇప్పటివరకు దాదాపు 30 సీటీస్కాన్‌లు ఫోకస్ డయాగ్నొస్టిక్ సెంటర్‌లో రోగులకు చేయించారు.

వైభవంగా చెన్నకేశవ రథోత్సవం



వెల్లాలో రథోత్సవంలో పాల్గొన్న కమిటీ సభ్యులు, ఈవో

చాగలమర్రి, మే 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లాల క్షేత్రంలో బుధవారం చెన్నకేశవ, సంజీవరాయ రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు నారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి, మాజీ జెడ్పీటీసీ మహేశ్వర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, ఈవో వెంకటరమణ, నరసింహారెడ్డి, సుబ్బిరెడ్డి, కమిటీ సభ్యులు, ఎస్‌ఐ పాల్గొని రథాన్ని ముందుకు లాగి ప్రారంభించారు. వేద పండితులు మాధవాచార్యులు, శేషాచార్యుల ఆధ్వర్యంలో చెన్నకేశవ, సంజీవరాయ ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు, ప్రజలు పాల్గొన్నారు. రథాన్ని పురవీధుల గుండా లాగుతూ ఊరేగింపు చేశారు. భక్తులకు కమిటీ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. సీఐ, ఎస్‌ఐల పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

హోరాహోరీగా రాతిదూలం పోటీలు

చాగలమర్రి, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లాల క్షేత్రంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం జాతీయస్థాయి రాతిదూలం పోటీలను మాజీ ఎంపీపీ ఎస్.రాఘవరెడ్డి ప్రారంభించారు. వివిధప్రాంతాలకు చెందిన ఐదుజతల వృషభాలు పాల్గొన్నాయి. గెలుపొందిన వృషభ యజమానులకు మొదటి బహుమతి రూ.1.11 లక్షలు, రెండో బహుమతి రూ.75వేలు, మూడో బహుమతి రూ.50వేలు, నాల్గో బహుమతి రూ.10వేలు నగదును దాతలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నారాయణరెడ్డి, మాజీ జెడ్పీటీసీ మహేశ్వర్‌రెడ్డి, సుబ్బిరెడ్డి, నరసింహారెడ్డి, పురుషోత్తమ్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సర్వే వందశాతం పూర్తి చేయాలి

బనగానపల్లె, మే 14 (ఆంధ్రజ్యోతి): అసంక్రమిత, సంక్రమిత వ్యాధుల 3.0 సర్వే వందశాతం పూర్తి చేయాలని రాష్ట్రీయ ప్రోగ్రాం అధికారి డాక్టర్ కాంతారావు వైద్య సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండలంలోని టంగుటూరు, కైప, మీరాపురం, తమడపల్లె కేంద్రాలను టంగుటూరు వైద్యాధికారి డాక్టర్ శివశంకరుడు ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సర్వేను ఆయన పరిశీలించారు. హైపర్ టెన్షన్, డయాబెటిస్, క్యాన్సర్ సంబంధించిన పరీక్షలను పకడ్బందీగా చేయాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, సంచార చికిత్స సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

విధులు సక్రమంగా నిర్వహించాలి: ఎంపీడీవో

బనగానపల్లె, మే 14 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శులు విధులు సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీవో రమణ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఈకేవైసీ ని పూర్తి చేయించాలని కోరారు. గ్రామ సచివాలయాలకు వచ్చే ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. సచివాలయాలకు వేళకు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలే కీలకం: ఏవో

కొలిమిగుండ్ల, మే 14 (ఆంధ్రజ్యోతి): రైతుల పంటల సాగులో భూసారపరీక్షలే కీలకమని మండల వ్యవసాయాధికారి భూమా జ్యోతి అన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో రైతుల పొలాల్లో భూసార పరీక్షల కోసం మట్టి నమూనాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల సిబ్బంది ఆధ్వర్యంలో మట్టి నమూనాలు సేకరించి, భూసార పరీక్షలకు పంపామన్నారు. ఫలితాల ఆధారంగా రైతులు పంటలు సాగు చేయడం ద్వారా అనేక ఉపయోగాలు ఉంటాయని ఆమె సూచించారు.

రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోండి

కొలిమిగుండ్ల, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు నూతన రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ బాల ఈశ్వరరెడ్డి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అర్హత కలిగినవారు రేషన్‌కార్డులను పొందడానికి, తప్పులను సరి చేసుకునే అవకాశం కూడా కల్పించినట్లు తెలిపారు.

శోభాయాత్ర విజయవంతం చేయాలి

కొలిమిగుండ్ల, మే 14 (ఆంధ్రజ్యోతి): ఈనెల 22న హనుమాన్ జయంతి సందర్భంగా ధార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే శోభాయాత్రను హిందువులు విజయవంతం చేయాలని ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సహాయ ప్రచారక్ శ్రీనివాసులు, సభ్యులు చంద్రశేఖరరెడ్డి, రాముడునాయక్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక సాయి బాబా గుడిలో ఛత్రపతి శంభాజీ జయంతి, ఇటీవల పాకిస్థాన్ యుద్ధంలో వీరమరణం పొందిన మురళీనాయక్ చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం 22న జరిగే శోభాయాత్రపై ధార్మిక సంఘాల వారితో చర్చించారు. భవాణి, సత్యమయ్య, మహేష్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

పెద్దమ్మ అమ్మవారికి పూజలు



పెద్దమ్మకు పూజలు చేస్తున్న బీసీ ఇందిరమ్మ

అవుకు, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోకులదిన్నె గ్రామంలో నిర్వహించిన పెద్దమ్మ అమ్మవారి 16 రోజుల పండగ కార్యక్రమానికి మంత్రి సతీమణి బీసీ ఇందిరమ్మ, సోదరుడు రామనాథరెడ్డి హాజరయ్యారు. గ్రామానికి చేరుకున్న బీసీ ఇందిరమ్మకు, బీసీ రామనాథరెడ్డికి గ్రామ ప్రజలు ఘనస్వాగతం పలికారు. పెద్దమ్మ ఆలయం వద్దకు చేరుకొని అమ్మవారికి పూజలు చేశారు. అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు పనులు సాగేనా?



తొడెండ్లపల్లెలో ఆగిన సీసీ రోడ్డు పనులు

చాగలమర్రి, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొడెండ్లపల్లె గ్రామంలో పల్లె పండుగ సందర్భంగా మంజూరైన సీసీ రోడ్డు పనులు నిలిచి పోయాయి. పనులు పూర్తి చేయకపోవడంతో రహదారి వెంట వెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇరువైపులా మురికి కాలువలు వేసి రోడ్డు వేయకుండా నిలిపివేశారు. మంజూరైన నిధుల వరకు రోడ్డు పనులు చేసి వదిలేశారు. కొద్దిపాటి వర్షానికే రహదారిలో నీరు నిలిచి కుంటలా మారుతోంది. దీంతో రాకపోకలు చేసేందుకు ఇబ్బందిగా ఉందని గ్రామస్థులు వాపోతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి ఆగిన రోడ్డు పనులను పూర్తి చేసి రహదారి సమస్య తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

క్రీడా మైదానం ఇదేనా..?

- కంపు కొడుతున్న కొలిమిగుండ్ల హైస్కూల్ ఆవరణం
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
- ఆరేళ్లుగా పరిష్కారం కాని సమస్య



మురుగు కుంటను తలపిస్తున్న పాఠశాల ప్రాంగణం

కొలిమిగుండ్ల, మే 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కొలిమిగుండ్లలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల క్రీడా మైదానం కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా మురుగుకుంటలా దర్శనమిస్తోంది. దీంతో క్రీడామైదానంలో ఆడుకునే విద్యార్థులు, ఉదయం వాకింగ్ చేసే ప్రజలు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. ఇది క్రీడామైదానమేనా అని ముక్కున వేలు వేసుకుంటున్నారు. వర్షాకాలం వచ్చిందంటే చాలు నెలల తరబడి వర్షపు నీరు పాఠశాల ఆవరణంలో నిలిచిపోయి మురుగు గుంతను తలపిస్తూ దుర్వాసన వెదజల్లుతోంది. ఆరేళ్లుగా కంపు కొడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కొలిమిగుండ్ల జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలను నాడు-నేడు కింద ఎంపిక చేసినా సదరు సమస్య పరిష్కరించలేకపోవడం గమనార్హం. నాడు-నేడు పనులు చేపట్టినా డ్రైనేజీ వ్యవస్థపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని పలువురు ఆరోపిస్తున్నారు. వర్షం నీరు నెలల తరబడి నిలిచి ఉండటంతో, కుళ్లిన దుర్వాసన వస్తోంది. దీంతో విద్యార్థులు మైదానంలో ఆడుకోవాలన్నా, తరగతి గదుల బయట తిరగాలన్నా ఇబ్బందిగా మారిందని వాపోతున్నారు. పాఠశాలలో మొత్తం 580 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. మరో 25రోజుల్లో పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతున్నా మురుగు కుంటపై అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు. పాఠశాల పక్కనే మీర్జాపురం రహదారి నిర్మాణ సమయంలో వరద నీరు వెళ్లేందుకు ఏర్పాటు చేయకపోవడంతో ఈ సమస్య తలెత్తింది. అయితే ఏళ్లు గడుస్తున్నా సమస్యను అటు ప్రభుత్వం, ఇటు విద్యాశాఖ అధికారులు అలాగే వదిలేయడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

- మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి • ప్రజల నుంచి అర్జీలు స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, మే 14 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె నియోజకవర్గంలో సమస్యలు పరిష్కరించడమే తన ధ్యేయమని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం మంత్రి క్యాంపు కార్యాలయంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ అర్జీలను స్వీకరించి పలు సమస్యలను పరిష్కరించారు. కొన్ని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ వర్గాల ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చారు. మంత్రి మాట్లాడుతూ ప్రజలనుంచి వచ్చే ఆయా సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసకువెళ్లి సాధ్యమైనంత వరకు త్వరగా పరిష్కరించనున్నట్లు తెలిపారు. న్యాయబద్ధంగా ఉన్న సమస్యలను అక్కడికక్కడే ఫోన్‌లో మాట్లాడి మంత్రి పరిష్కరించారు. అర్జీలు స్వీకరించి సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించడంతో బాధితుల నుంచి సర్వత్రా హర్షం వ్యక్తం చేశారు.

'దద్దనాల'లో ముమ్మరంగా పనులు

- రూ. 10లక్షలతో పూడికతీత, ముళ్లకంప తొలగింపు పనులు



కాల్వలో పూడికను తీస్తున్న ఎక్స్‌కవేటర్

బనగానపల్లె, మే 14 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె నియోజకవర్గంలోని ఒకే ఒక మైనర్ ఇరిగేషన్ దద్దనాల ప్రాజెక్టు సమీపంలో ముమ్మరంగా పనులు చేపట్టారు. రూ. రూ.10లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు బనగానపల్లె మైనర్ ఇరిగేషన్ ఏఈ రామ్మోహన్‌రెడ్డి బుధవారం తెలిపారు. దద్దనాల ప్రాజెక్టు పంట కాల్వల్లో పూడిక తీత, ముళ్ల కంపల తొలగింపు, తూము మరమ్మతు పనులు చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం వచ్చిన నిధులతో పనులు చేపట్టామన్నారు. అలాగే త్వరలో గేట్లు మరమ్మతులు, పంట కాల్వల మరమ్మతులు, ఇతరత్రా పనుల కోసం రూ.2కోట్లతో ప్రతిపాదనలు పంపుతున్నట్లు తెలిపారు. ఓ గేటు పూర్తిగా దెబ్బతినిందని దాని స్థానంలో కొత్త గేటు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపుతున్నట్లు తెలిపారు.

ఉపాధి ఎఫ్‌ఏల సస్పెన్షన్

చాగలమర్రి, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దూరు, తోడెండ్లపల్లె గ్రామాలలో ఉపాధిహామీ విధులు నిర్వహిస్తున్న ఎఫ్‌ఏలను సస్పెండ్ చేసినట్లు ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఏపీవో ఖాసీం సాహేబ్ తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ ఉపాధి పనులు కల్పించడంలో, విధుల పట్ల అలసత్వం, వివిధ కారణాలతో విధుల నుంచి తప్పించామన్నారు. మల్లేవేముల, గొట్లూరు, గొడిగనూరు, చింతలచెరువు, డి.వనిపెంట, చిన్నవంగలి, చిన్నబోదనం గ్రామాల్లో ఖాళీగా ఉన్న ఎఫ్‌ఏ పోస్టులను భర్తీ చేసేందుకు జిల్లా కలెక్టర్, ఉపాధి పీడీలకు ప్రతిపాదనలు చేశామన్నారు. కొత్తవారిని నియమించేందుకు నివేదికలు పంపించామని అన్నారు. ఆయా గ్రామాల్లో ఎఫ్‌ఏ విధులను టీఏలు కొనసాగిస్తారని తెలిపారు.

గృహ లబ్ధిదారులకు అదనపు సాయం

చాగలమర్రి, మే 14 (ఆంధ్రజ్యోతి): పక్కా గృహాలు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు ప్రభుత్వం అదనపు సాయం మంజూరు చేసిందని ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ తెలిపారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణాలు చేపట్టిన బీసీ, ఎస్సీ ఎస్టీలకు అదనపు సాయం మంజూరైందన్నారు. ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.70 వేలు, చెంచులకు రూ.లక్ష అదనపు సహాయం మంజూరైందన్నారు. చాగలమర్రి మండలంలో 260 మంది లబ్ధిదారులకు రూ.38.42 లక్షలు అదనపు నిధులు వారి ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. పక్కా గృహాల నిర్మాణాలు వేగవంతం చేయాలని కోరారు.

నేటి నుంచి పూదోట మఠంలో సప్తాహం

బేతంచెర్ల, మే 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గౌరిపేటలోని పూదోట మఠంలో గురువారం నుంచి అఖండ హనుమాన్ చాలీసా సప్తాహం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గుండా గోపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మఠంలో ఉదయం 8గంటల నుంచి రాత్రి 8గంటల వరకు భజన కృష్ణయ్య బృందంతో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి అల్పాహారం ఉంటుందని తెలిపారు. కార్యక్రమం వారం రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

19న ఉప సర్పంచ్ ఎన్నిక

సంజామల, మే 14(ఆంధ్రజ్యోతి): ఈ నెల 19న గిద్దలూరు గ్రామ పంచాయతీలో ఉప సర్పంచ్ ఎన్నికను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సాల్మన్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉప సర్పంచ్‌గా కొనసాగుతున్న బి. సులోచన రాజీనామా చేయడంతో ఎన్నిక అనివార్యమైందన్నారు.

కౌలుదారు పత్రం ఉంటేనే ప్రభుత్వ పథకాలు

బేతంచెర్ల, మే 14 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో కౌలుకు పొలం తీసుకుని సాగు చేస్తున్న కౌలు రైతులు కౌలుదారు పత్రం కలిగి ఉంటేనే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని మండల వ్యవసాయాధికారి కిరణ్ కుమార్ తెలిపారు. బుధవారం ఎంబాయి గ్రామంలో రైతులకు, కౌలు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీఈవో స్వాతి, వీఆర్వోలు, కౌలు రైతులు ఉన్నారు.

చాగలమర్రి: గ్రామాల్లోని కౌలు రైతులకు గుర్తింపు కార్డు తప్పనిసరి అని ఏవో రంగనేతాజీ సూచించారు. బుధవారం మండలంలోని డి.వనిపెంట, గొడిగనూరు గ్రామాల్లో పంట సాగు హక్కు పత్రాల గురించి కౌలు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

చాగలమర్రి, మే 14 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని వాసవీ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. బుధవారం 170 మంది విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షకు హాజరైనట్లు ప్రిన్సిపాల్ ఓబులేసు తెలిపారు. ఎస్‌వో, డీవోలుగా పెద్దయ్య, చంద్రశేఖర్‌రెడ్డిల పర్యవేక్షణలో సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

ఆలయాల భూములకు కౌలు వేలం

శిరివెళ్ల, మే 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటపాడు గ్రూపు దేవాలయాల పరిధిలోని వివిధ ఆలయాలకు చెందిన భూములకు 2025-26 సంవత్సరానికి గాను ఏడాది కాలపరిమితితో బహిరంగ కౌలువేలం నిర్వహిస్తున్నట్లు కార్య నిర్వహణాధికారి రామాంజనేయ శర్మ బుధవారం తెలిపారు. కోటపాడులోని వీరభద్ర స్వామి ఆలయానికి చెందిన 38.27 ఎకరాల భూములకు, కేశవస్వామి దేవస్థానానికి చెందిన 45.58 ఎకరాల భూములకు ఈ నెల 19వ తేదీ ఉదయం 10 గంటలకు కౌలు వేలం నిర్వహిస్తున్నామన్నారు. అదే రోజు సాయంత్రం 4 గంటలకు చెన్నూరు గ్రామంలో వెలసిన వెంకటేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన 20.42 ఎకరాల భూములకు కౌలు వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు. బోయలకుంట్లలోని వివిధ ఆలయాలకు చెందిన 66.15 ఎకరాల భూములకు ఈ నెల 20న ఉదయం 10.30 గంటలకు బహిరంగ కౌలు వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గుండంపాడులోని వేణుగోపాలస్వామి ఆలయానికి చెందిన భూములకు ఈ నెల 26న ఉదయం10.30 గంటలకు, అదేరోజు సాయంత్రం శిరివెళ్లలోని ఓంకారేశ్వరస్వామి ఆలయానికి చెందిన 51.30 ఎకరాల భూములకు కౌలు వేలం నిర్వహిస్తున్నామన్నారు. కౌలువేలంలో పాల్గొనదలచిన వారు నిర్ణీతరుసుం డిపాజిట్‌గా చెల్లించాల్సి ఉంటుందన్నారు.

పార్కింగ్ స్థలాలు ఏర్పాటు

పర్యవేక్షణకు ట్రాఫిక్ పోలీసులు

డోన్ రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): పట్టణం నడిబొడ్డులో ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఇకపై మోటారు బైకుల పార్కింగ్ ఇష్టానుసారంగా చేస్తే కుదరదు. డోన్ డీఎస్పీ శ్రీనివాసులు పర్యవేక్షణలో పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా, రూరల్ సీఐ సీఎం రాకేష్‌బాబులు ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకుంటున్నారు. కొన్ని నెలల క్రితమే ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఏడు బ్లాకులను తమ ఆధీనంలోకి తీసుకుని ప్రజల సహకారంతో సిమెంటు బెడ్లను ఏర్పాటు చేశారు. అనంతరం బైకులను ఒక ఫ్లైఓవర్ క్రింద క్రమ పద్ధతిలో పెట్టి, తిరిగి పార్కింగ్ నుంచి బయటకు వెళ్లేందుకు అనువుగా మార్కింగ్ ఏర్పాటు చేశారు. డోన్ అవుట్ పోస్టు ట్రాఫిక్ పోలీసులను పరిశీలించేందుకు ఏర్పాటు చేయడంతో పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



డోన్ ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద పార్క్ చేసిన మోటారుసైకిళ్లు

దెబ్బతిన్న రోడ్ల వంతెనలు



రామక్రిష్ణాపురం దగ్గర దెబ్బతిన్న వంతెన

ప్యాపిలి, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో గ్రామీణ రహదారుల వంతెనలు దెబ్బతిన్నాయి. దీంతో ఈ రహదారులపై ప్రయాణం చేయాలంటే ప్రయాణికులు భయాందోళనలకు గురవుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండలంలోని చిగురుమాను మిట్ట నుంచి గోపాల్ నగరం గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గంలోని వంతెన పరిస్థితి అధ్వానంగా తయారైంది. ఈ రహదారిపై నిత్యం పదుల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. అలాగే రామక్రిష్ణాపురం గ్రామం సమీపంలో నిర్మించిన వంతెన గత రెండేళ్ల క్రితం కురిసిన భారీ వర్షానికి పూర్తిగా దెబ్బతినింది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీంతో ప్రజలు రవాణా పరంగా కష్టాలు పడుతున్నారు. అధికారులు స్పందించి దెబ్బతిన్న గ్రామీణ రహదారుల వంతెనలకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

డోన్ టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత బస్టాండులో రూ.ఆరు కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న కూరగాయల మార్కెట్ ఫస్ట్ ఫ్లోర్ పనులు మరో పది రోజుల్లో పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ సప్తశైల రాజేష్ అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను త్వరగా పూర్తిచేస్తే ఓపెన్ యాక్షన్ ద్వారా ప్రజలకు కేటాయిస్తామన్నారు. రాబోవు కౌన్సిల్ సమావేశంలో దీనికి ఆమోదం తెలుపుతామని, అలాగే హిందూ శ్మశాన వాటికకు మున్సిపల్ నిధుల నుంచి రూ.10 లక్షలు నిధులు కేటాయిస్తామన్నారు. 16న మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ డోన్ పట్టణానికి రానున్నారని, పట్టణంలో ప్రజలకు కావల్సినటువంటి మౌలిక వసతుల కోసం నివేదిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో కమిషనర్ ప్రసాద్‌గౌడు, డీఈ రఘు, ఏఈ సురేష్, ఆర్‌వో, టౌన్ ప్లానింగ్, అకౌంట్ సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

చిన్నారుల మృతిపై మంత్రి బీసీ సంతాపం

బనగానపల్లె, మే 14 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో ఐదుగురు చిన్నారుల మృతిపై రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బుధవారం టీడీపీ కార్యాలయంలో మంత్రి బీసీ మాట్లాడుతూ కడప జిల్లా బ్రహ్మంగారి మఠం మండలంలోని మల్లె వల్లె చెర్వులో ఈతకు వెళ్లిన ఐదుగురు చిన్నారుల మృతిపై మంత్రి బీసీ సంతాపం వ్యక్తం చేశారు. ఇటువంటి దుర్ఘటనలు జరుగడం అత్యంత దురదృష్టకరమన్నారు. చిన్నారుల తల్లిదండ్రులకు, కుటుంబాలకు, ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

దళితులపై దాడులు చేస్తే కేసులు

సీఐ హనుమంతనాయక్



సీఐ హనుమంతనాయక్

కోవెలకుంట్ల, మే 14 (ఆంధ్రజ్యోతి) : దళితులపై దాడులు చేస్తే ఎస్సీ ఎస్టీ కేసులు నమోదు చేస్తామని కోవెలకుంట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ హనుమంతనాయక్ అన్నారు. బుధవారం కోవెలకుంట్ల సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడారు. సర్కిల్ పరిధిలోని సంజామల, కోవెలకుంట్ల, రేవనూరు పోలీసుస్టేషన్లు ఉన్నాయన్నారు. గ్రామాల్లో దళితులపై దాడులు చేస్తే నిర్భయంగా సర్కిల్ కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. విచారణ జరిపించి రుజువైతే వారిపై క్రిమినల్ కేసులతో పాటు ఎస్సీ ఎస్టీ కేసులు నమోదు చేస్తామన్నారు.

గజవాహనంపై పాండురంగడు

కోవెలకుంట్ల, మే 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పాండురంగ విఠలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి స్వామివారు గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ గుండయ్య, కమిటీ సభ్యులు, ప్రసాద్‌రెడ్డి, గడ్డం నాగేశ్వర్‌రెడ్డి, కె.లక్ష్మినాగేంద్రబాబు, సుదర్శన్‌రెడ్డి, మంజు, సింగిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి, బాలాజీసింగ్, అమర్‌నాథ్, కొమ్ము రాజు, కొప్పెర నరసింహమూర్తి, బోయరంగడు, టీడీపీనాయకులు పాల్గొన్నారు. అంతకుముందు వేద పండితులు సుదర్శనచారి, వేణుగోపాలచారి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు మంత్రి బీసీ రాక

కోవెలకుంట్ల పట్టణంలో పాండురంగ విఠలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి రానున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గుద్దేటి గుండయ్య తెలిపారు. గురువారం సాయంత్రం స్వామివారి రథోత్సవంలో మంత్రి పాల్గొంటారని పేర్కొన్నారు. వేడుకల్లో భక్తులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా..

అవుకు: పట్టణంలోని కోట వీధిలో వెలసిన భూలక్ష్మీ సమేత చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి గజ వాహనంపై ఊరేగారు. అర్చకులు ఉత్సవమూర్తులను గజవాహనం పై అలంకరించి పూజలు చేసి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు రథోత్సవం:

శ్రీభూలక్ష్మీ సమేత చెన్నకేశవస్వామి రథోత్సవం కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం కన్నుల పండుగగా నిర్వహించే ఏర్పాట్లు చేశారు. ఉత్సవ మూర్తులను రథంపై అలంకరించి తేరువీధి నుంచి రాజవీధి, అమ్మవారిశాలవీధి మీదుగా మండపం వీధి వరకు రథోత్సవం నిర్వహించనున్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు



వైద్యాధికారి శ్రీజారెడ్డి

రుద్రవరం, మే 14 (ఆంధ్రజ్యోతి): రోగులకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందిస్తామని వైద్యాధికారి శ్రీజారెడ్డి అన్నారు. ఆలమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా బాధ్యతలు చేపట్టినట్లు బుధవారం ఆమె తెలిపారు. అటవీ తీర సమీప గ్రామాలు పీహెచ్‌సీ పరిధిలో అధికంగా ఉన్నాయని అన్నారు. వేసవి కావడంతో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, ఎండలో తిరగకూడదని ప్రజలకు సూచించారు.

ఉపాధి పనుల వద్దనే మస్టరు వేయాలి

రుద్రవరం, మే 14 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి పనుల వద్దనే మస్టరు వేయాలని ఎంపీడీవో భాగ్యలక్ష్మి సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుత ఉపాధి పనుల్లో భాగంగా పంట కాల్వల పూడికతీత పనులు, మామిడి తోటల్లో చెట్లకు చుట్టూ కందకాలు పనులు నిర్వహిస్తున్నామన్నారు. 4509 మంది కూలీలు పనులకు హాజరవుతున్నారని తెలిపారు.

నేడు దేవాలయ భూములకు కౌలు వేలం

రుద్రవరం, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దకంబలూరులో ఆంజనేయస్వామి దేవాలయ భూమికి గురువారం కౌలు వేలం నిర్వహిస్తున్నట్లు దేవదాయశాఖాధికారి రామాంజనేయ శర్మ బుధవారం తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ. రెండువేల డిపాజిట్ చెల్లించాలన్నారు.

జనసేన సభ్యత్వ కార్డుల పంపిణీ

ఆళ్లగడ్డ మే 14(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డలోని జనసేన పార్టీ కార్యాలయంలో క్రియాశీలక సభ్యత్వ నమోదు చేసుకొన్న కార్యకర్తలకు ఐడికార్డు, కిట్లను పార్టీ సమన్వయకర్త మల్లయ్య బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వ తీసుకొన్న జనసైనికులకు బీమా సౌకర్యం కల్పించామన్నారు. కార్యక్రమంలో జనసేనా నాయకులు అంజనేయులు, మద్దిలేటి యాదవ్, బ్రహ్మేంద్రకుమార్, కోటి, గుర్రప్ప, నాగేంద్ర, రమణాచారి పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు

ప్యాపిలి, మే 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు పాల్పడిన చర్యలు తప్పవని ఏపీడీ నరసింహారెడ్డి హెచ్చరించారు. బుధవారం వెంగళాంపల్లిలో జరిగే ఉపాధి పనులను ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయన కూలీల మస్టర్లను పరిశీలించారు. ఆయన వెంట ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.